PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 72 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 12 మార్చి 2025


## లెక్చరర్లకు నేడు నియామకపత్రాలు




## వాహనా తనిఖీల్లో గంజాయి పట్టివేత




## నిరుద్యోగ యువతకు రూ.3 లక్షలు సాయం



**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** వీరనారి ఐలమ్మ యూనివర్సిటీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత భవనాలను రెన్నోవేషన్ చేస్తున్నామని అన్నారు.

వివరాలు 2లో

# పునర్విభజనతో ఎపి, తెలంగాణలో 8 లోక్‌సభ సీట్లు గల్లంతు

- జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు నష్టం
- తెలుగు రాష్ట్రాలు 8 లోక్‌సభ సీట్లు కోల్పోతాయి: కాంగ్రెస్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మంగళవారం స్పందిస్తూ. కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలు జరిపిన, మొత్తం సంతానోత్పత్తి రేట్లను తగ్గించిన రాష్ట్రాలను ఆ ప్రక్రియ 'శిక్షించడమే' అవుతుందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ 'ఎక్స్'లో ఒక సుదీర్ఘ పోస్ట్‌లో తొమ్మిది రాష్ట్రాల సంగతిని ప్రధానంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టిన పక్షంలో ఆ తొమ్మిది రాష్ట్రాలు ఒక్కొక్కటి ఒకటి నుంచి ఎనిమిది వరకు లోక్‌సభ సీట్లను నష్టపోవచ్చునని, కానీ ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు 11, 10 సీట్లను అధికంగా పొందగలవని ఆయన తెలిపారు. 'సీట్లు నష్టపోయే రాష్ట్రాలు తమిళనాడు (8), కేరళ (8), ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో (8), ఒడిశా (3), పశ్చిమ బెంగాల్ (4), కర్నాటక (2), హిమాచల్ ప్రదేశ్ (1), ఉత్తరాఖండ్ (1). కాగా, అస్సాం, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర ఏ సీటునూ నష్టపోవడం లేదా అధికంగా పొందడం జరగదు' అని ఆయన వివరించారు. 'లబ్ధి పొందే రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్ (11), బీహార్ (10), రాజస్థాన్ (6), మధ్య ప్రదేశ్ (4), ఝార?ండ్ (1), హర్యానా (1), గుజరాత్ (1), ఢిల్లీ (1), చండీగఢ్ (1)' అని రమేష్ తెలియజేశారు. ఆయన తన వాదనకు సమర్థనగా ఇద్దరు పండితులు

వివరాలు 2లో

# నేను అసెంబ్లీకి వస్తున్నా.. అంతా సిద్ధం

- అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం
- ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం
- బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో కెసిఆర్ కీలక ఆదేశాలు



**హైదరాబాద్,11(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి , అసెంబ్లీలో విపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. నేనూ వస్తున్నా.. మీరంతా రావాలి..సమస్యలపై పోరాడుదాం అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని సూచించారు. ప్రతిరోజూ అసెంబ్లీకి తప్పకుండా హాజరుకావాలని సూచించారు. అరగంట ముందుగా 9:30కే అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశర చేశారు. 'హామీల అమల్లో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి.

వివరాలు 2లో

# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు
- ప్రభుత్వాన్ని నిలదీసేలా బిఆర్ఎస్ సన్నద్ధం



## శ్రీచైతన్య కాలేజీల్లో కొనసాగుతున్న దాడులు

5కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు



**హైదరాబాద్, 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీచైతన్య కాలేజీల్లో ఐటీ సోదాలు వరుసగా రెండోరోజూ కొనసాగాయి. మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు

వివరాలు 2లో

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్

- రోబోలను రంగంలోకి దింపిన అధికారులు

**నాగర్‌కర్నూలు,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ 18వ రోజు కొనసాగుతుంది. మంగళవారం రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికే టన్నెల్‌లోకి అన్వీ రోబో బృందం వెళ్లింది. డేంజర్ జోన్‌లో రోబోలతో తవ్వే ప్రయత్నం చేశారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన రెండు చోట్ల తవ్వకాలు మొదలు పెట్టారు. కాగా.. సాయంత్రానికి రెండు మృతదేహాలు వెలికితీసే అవకాశం ఉంది. కేరళకు చెందిన క్యాడవర్ శునకాలు మృతదేహాల ఆనవాళ్లు పసిగట్టాయి. దాంతో ఆ



ప్రాంతంలో తవ్వితే ఒకరి మృతదేహం బయటకు తీశారు. అతి కష్టం మీద మరో ఐదడుగులు తవ్వారు. ఇంజనీర్ ఆచూకీని

వివరాలు 2లో

# కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

- దత్తత గ్రామంలో మంత్రి సీతక్కతో కలసి పర్యటన
- గిరిజనుల ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ఆశ్చర్యం
- కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ములుగు,11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్ , కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన



పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అగన్వాడీ

వివరాలు 2లో

# రెండునెలల్లో ట్రిపుల్‌ఆర్‌కు అనుమతులు

- కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ, 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** రీజినల్ రింగ్‌రోడ్డు కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి -

వివరాలు 2లో

# ఆ పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి: పొన్నం




**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** భవిష్యత్‌లో సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావడానికి ఈ శిక్షణ ఉపయోగపడు తుందని, గతంలో నెల రోజుల పాటు శిక్షణ ఉండేదని, ఇప్పుడు నెలుగు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఫీల్డ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంత ంగా పని చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడు తుందని, రవాణా శాఖ గౌరవాన్ని కాపాడుతుం దని ఆయన అన్నారు. ఉద్యోగం పొందినప్పుడు ఎలా ఉంటారో దానిని ఎప్పటికీ

వివరాలు 2లో



## హామీలు అమలు కావని తెలంగాణ సిఎం అంగీకరించారు

- కర్ణాటక అసెంబ్లీలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై చర్చ

# నిరుద్యోగ యువతకు రూ.3 లక్షలు సాయం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్షాలనలో భాగంగా యూనివర్సిటీ ప్రధాన ద్వారం సుందరీకరిస్తున్నామని, ప్రధాన ద్వారం సుందరీకరణకు రూ. 520 కోట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. ఎస్సి,ఎస్టి సబ్ ప్లాన్ నిధులను నిరుద్యోగ యువతకు కేటాయించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని వెల్లడించారు. రూ. 6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం ప్రారంభం కానుందని అన్నారు. ఎస్సి,ఎస్టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు%ా%స్వయం ఉపాధి కింద రూ.3 లక్షలు తగ్గకుండా ఆర్థిక సాయం అందుతుందని, ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 5 వరకు అప్లికేషన్ ప్రాసెస్ జరిపి, మే 31 లోగా సెలెక్షన్ ప్రాసెస్ పూర్తి చేస్తామని తెలియజేశారు. జూన్ 2 న సెలెక్ట్ అయన వారికి లెటర్స్ ఇస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల

**హైదరాబాద్,11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళ వారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

## శ్రీచైతన్య కాలేజీల్లో కొనసాగుతున్న దాడులు

(మొదటి పేజీ తరువాయి)

రూ.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎపి, తెలంగాణతో పాటు 10 ప్రాంతాల్లో దాడులు చేస్తున్నారు. అడ్మిషన్లు, ట్యూషన్ ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. లావాదేవీల సాఫ్ట్‌వేర్‌ను ఐటీ అధికారులు పరిశీలించారు. శ్రీచైతన్య కాలేజీల ట్యాక్స్ చెల్లింపులపై ఐటీ ఆరా తీస్తోంది. 2020లోనూ శ్రీచైతన్య కాలేజీలపై ఐటీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. గతంలోనూ రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్నవిషయం విదితమే. దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై సహా పలు ప్రాంతాల్లోని శ్రీ చైతన్య విద్యాసంస్థల కార్పొరేట్ కార్యాలయాలపై ఒక్కసారిగా దాడులు చేపట్టారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ రషీదులు ఇవ్వకుండా పెద్దఎత్తున ట్యాక్స్ ఎగ్గొడుతున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ముందుగా హైదరాబాద్ మాదాపూర్‌లోని ప్రధాన కార్యాలయంలో సోదాలు నిర్వహించిన అధికారులు అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు సమాచారం. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయాలపై దాడులు చేశారు. ఈ సోదాల్లోనూ పెద్దమొత్తంలో అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నేరుగా నగదు తీసుకునేందుకు ఒక సాఫ్ట్వేర్.. అలాగే ప్రభుత్వానికి కట్టే ట్యాక్స్ కోసం మరో సాఫ్ట్వేర్ ఏర్పాటు చేసుకున్నట్లు ఐటీ అధికారులు నిర్ధారించారు.

## లెక్చరర్లకు నేడు నియామకపత్రాలు

### - రవీంద్రభారతిలో అందించనున్న సిఎం రేవంత్

**హైదరాబాద్, 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మార్చి 12న బుధవారం నియామక పత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు 1,292 మంది, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు 240 మందిని ఇటీవల టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. కొత్తగా నియమితులైన లెక్చరర్లకు విద్యా శాఖ విధానాలు, బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చి కాలేజీల్లో పోస్టింగులు ఇవ్వనున్నట్లు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. కొత్త లెక్చరర్ల నియామకాలతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు.

## రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్‌ఆర్‌ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# పునర్విభజనతో ఎపి, తెలంగాణలో 8 లోక్‌సభ సీట్లు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

మిలన్ వైష్ణవ్, జేమీ హింట్సన్ 2001, 2011 జనాభా లెక్కల సేకరణ డేటాను ఉపయోగించి 2019 మార్చిలో చేసిన విశ్లేషణను ఉటంకించారు. 2026లో జనాభా అంచనాను ఉపయోగించినట్లయితే సీట్ల పంపిణీకి ఏమి జరుగుతుందో అది వెల్లడించింది. 'సీట్లను నష్టపోయే రాష్ట్రాలు జాతీయ లక్ష్మైన కుటుంబ నియంత్రణలో విజయం సాధించడం, మొత్తం సంతానోత్పత్తి రేట్లను తగ్గించడం కారణంగా ఆ ప్రభావానికి గురవుతాయి. అవి అందు కోసం శిక్షకు గురవుతాయి' అని రమేష్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. లోక్‌సభ సీట్ల పునర్విభజన ప్రక్రియపై 'రాజీలేని పోరు' సాగించేందుకు తమిళనాడుతో చేతులు కలపాలని, సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి)లో భాగం కావాలని ఆహ్వానిస్తూ తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ తెలంగాణ, కేరళ, కర్నాటక, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఒడిశా ముఖ్యమంత్రులకు గత శుక్రవారం లేఖ రాశారు. జెఎసి తొలి సమావేశాన్ని ఈ నెల 22న చెన్నైలో నిర్వహించాలని ఆయన ప్రతిపాదించారు. 'ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక' రూపకల్పనకు భాగస్వాములు కావలసిందిగా ఆ నేతలకు స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

# నేను అసెంబ్లీకి వస్తున్నా.. అంతా సిద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి)

పదేళ్లలో బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండగట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి..' అని మాజీ సీఎం కేసీఆర్ సమావేశంలో తెలిపారు.

# నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు
- ప్రభుత్వాన్ని నిలదీసేలా బిఆర్ఎస్ సన్నద్ధం



**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపోతే ఇప్పటికే అధికారులతో స్పీకర్ ప్రసాదరావు సమీక్షించారు. పలు సూచనలు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు ప్రకటించారు. 15న గవర్ర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు చర్చకు రానున్నాయి. కెసిఆర్ తొలిరోజు హాజరవుతారని ఇప్పటికే కెటిఆర్ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రుల సమావేశం జరిగింది. ఆయా శాఖలకు బడ్జెట్ లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈనెల 19 లేదా 20న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి మూడు లక్షల 20 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేఅవకాశం ఉంది. మార్చి 29 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహం పై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ పై చర్చ లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలకు బ్జడెట్ కేటాయింపులపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా చర్చలో పాల్గొనాలని కేసీఆర్ సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన పై ప్రభుత్వ తప్పిదం ఉందంటూ ఎత్తి చూపాలన్నారు. కాళేశ్వరం రిపేర్ చేయక పోవడంతోనే పంటలు ఎండుతున్నాయి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ అంశాలపై వాయిదా తీర్మానాలు ఇచ్చి.. వాటిపై చర్చ కు గట్టిగా పట్టు పట్టాలని ఎమ్మెల్యే లకు కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు.

# కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసుపు, పిండి యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ మాట్లాడుతూ.. 'ఆదివాసీలు వెనకబడి ఉన్నారు కాబట్టి అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడం చాలా ఆనందం అనిపించింది. ఈ కొండపర్తి గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలి. నేను ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చాను. మా గ్రామం కూడా నా చిన్నప్పుడు కొండపర్తిలానే ఉండేది.కొండపర్తిలో తయారుచేసే మసాలా, కారం, పసుపు ఒక ప్రత్యేక బ్రాండ్ లు గా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

# హామీలు అమలు కావని తెలంగాణ సిఎం అంగీకరించారు

- కర్ణాటక అసెంబ్లీలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై చర్చ

**హైదరాబాద్,మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్యారెంటీల అమలుకు నిధులు సమకూర్చడం ఎంత సవాలో ముఖ్యమంత్రి అయ్యాకే తెలిసొచ్చిందని మీ పార్టీకి చెందిన నేత, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని కర్ణాటక బిజెపినేత ఆర్.అశోక్ తెలిపారు. కర్ణాటక అసెంబ్లీలో తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా విపక్ష నేత ఆర్. అశోక్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రూ. 18 వేల కోట్లు పెన్షన్లు, వేతనాలకు చెల్లిస్తూ, గ్యారెంటీల వ్యయాన్ని మోయటం భారమేనని పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి అంగీకరించారని వ్యాఖ్యానించారు.కర్ణాటక ప్రభుత్వం తమ ఐదు గ్యారెంటీల అమలు కోసం సమితుల్లో కాంగ్రెస్ కార్యకర్తలను అధ్యక్షులుగా నియమించి వారికి కేబినెట్ హోదాను కల్పించింది. దీనిపై కర్ణాటక అసెంబ్లీలో బిజెపి విమర్శలు గుప్పించింది. ప్రభుత్వ పథకాల అమలుకు స్థానిక ఎంఎల్ఎలను నియమించకుండా, కాంగ్రెస్ పార్టీ సభ్యుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని బిజెపి సభ్యుడు కృష్ణప్ప ఆరోపించారు. ఈ నేపథ్యంలో విపక్ష నేత ఆర్. అశోక్ స్పందిస్తూ తెలంగాణ గ్యారెంటీలపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. గ్యారెంటీలపై జాతీయస్థాయిలో చర్చ అవసరమని ఇటీవల ఓ మీడియా కాన్క్లేవ్‌లో రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారని గుర్తు చేశారు. గ్యారెంటీల అమలు కష్టమని రేవంత్ రెడ్డి చెబుతుంటే, రాష్ట్రంలోని (కర్ణాటక) మీ కార్యకర్తల కోసం గ్యారెంటీ అమలు పేరిట అయిదేళ్లలో రూ. 50 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. మరో బిజెపి సభ్యుడు సతీశ్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు పార్టీ సభ్యులను నియమించి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిందని ఆరోపించారు.



# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

కనుగొన్న ప్రాంతానికి కొంచెం అటు ఇటుగా మరో ముగ్గురు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరో ఇద్దరి జాడ లభించే అవకాశం ఉంది. మిగిలిన వారు సొరంగం చిట్ట చివరి భాగం దగ్గర టీబీఎం కట్టర్ సమీపంలో చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో టీబీఎం మిషన్ కట్టింగ్, డీ వాటరింగ్ కొనసాగుతుంది. శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ సమయంలో 8 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టన్నెల్‌లో గౌరావ్ పెనిట్రేటింగ్ రాడార్ , క్యాడవర్ డాగ్స్ సాయంతో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాడార్, శునకాలు గుర్తించిన ప్రదేశాలను డీ1, డీ2, డీ3 ప్రాంతాలుగా విభజించి అక్కడ తవ్వకాలు చేపట్టారు అధికారులు. ఆదివారం నాడు డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపిన రెస్క్యూ టీమ్స్ ఓ ఇంజనీర్ మృతదేహాన్ని వెలికితీశాయి. రెస్క్యూ ఆపరేషన్ కు అడ్డుపడుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ కట్టింగ్, నీటి తొలగింపు పనులు కూడా నిరంతరం జరుగుతున్నాయి. కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. ఎంతమాత్రం అలసిపోకుండా, బృందాలు ఎప్పటికప్పుడు తమపనిని చురుకుగా కొనసాగిస్తు న్నారు. ఎన్డీఆర్ఎఫ్ , రెస్క్యూ టీమ్స్, పోలీసు విభాగం, ఫోరెన్సిక్, వైద్య బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

# ఆ పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి: పొన్నం

(మొదటి పేజీ తరువాయి)




కంటిన్యూ చేయాలని ఆయన తెలిపారు.రాజా బహుదూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో కొత్తగా ఎంపికై నియమకపత్రాలు పొందిన ఏఎంవిఐ (అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్) శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్ రావు , డిప్యూటీ డైరెక్టర్ నర్మదాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ మీరు చేసే పని రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గించేలా పని చేయాలని, ఫిట్‌నెస్ ఉందా లేదా డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తున్నామా లేదా అనే విధంగా పని చేయవద్దన్నారు.**నెల రోజుల్లో 'వాహన్' ప్రారంభం: కమిషనర్, సురేంద్ర మోహన్** రవాణా శాఖ కమిషనర్, సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ఏఎంవిఐలకు ట్రైనింగ్ లో స్కిల్స్ డెవలప్ మెంట్, క్రమశిక్షణ తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. ట్రాన్స్‌ఫోర్ట్ డిపార్ట్‌మెంట్ 65 ఆన్‌లైన్ సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వం శిక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసి పోర్టల్ ద్వారా సారథి డేటాను అప్‌లోడ్ చేశామని, 10 రోజుల్లో సికింద్రాబాద్ ఆర్టీఓ కార్యాలయంలో ప్రారంభించుకుంటామని ఆయన తెలిపారు.నెల రోజుల్లో 'వాహన్' కూడా ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో మరణాలు తగ్గించడానికి రవాణా శాఖ అవగాహన కల్పిస్తుందన్నారు. 2024 లో 26 వేల ప్రమాదాలు తెలంగాణలో జరిగితే 7 వేల మంది మృత్యువాత పడ్డారని ఆయన తెలిపారు. ఉమెన్ అండ్ చిల్డ్రన్ రక్షణ కొరకు రవాణా శాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ పెట్టడం జరిగిందని, ఈ వ్యవస్థ త్వరలోనే ప్రారంభం కానుందన్నారు.

# ప్రభుత్వ అసైన్డ్ భూముల రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అరికట్టండి

- నిబంధనలను అతిక్రమించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అనర్హుల స్వాధీనంలోని ప్రభుత్వ అసైన్డ్ భూములను స్వాదీనం చేసుకోవాలి
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్
- ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో ఆర్డీవో ఆఫీస్ వద్ద వినతి పత్రం అందచేత.



**నర్సంపేట మర్చి 11, (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ అసైన్డ్ భూములలో భూ దందాలకు పాల్పడుతూ నిబంధనలను అతిక్రమిస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్న వ్యక్తుల పైన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేటలో అత్యంత విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలని పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి ఆర్డీవో ఉమాదేవి కి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణం జనాభాపరంగా పెరిగి మునిసిపాలిటీ గా అవతరించిందని కానీ పేదలకు నివసించడానికి నిలువ నీడ లేక వేలాది కుటుంబాలు కిరాయి చెల్లిస్తూ జీవిస్తున్నారని మరోవైపు పేదలకు చెందాల్సిన ప్రభుత్వ అసైన్డ్ భూములు రోజురోజుకీ అన్యాక్రాంతం అవుతున్నాయని అధికారాన్ని అండగా చేసుకొని చట్టాలను నిబంధనలను అతిక్రమించి ఏం చేసినా చెల్లుతుందిలే అన్నట్లుగా వ్యవహారిస్తూ ఎలాంటి హక్కులు లేకపోయినా ప్రభుత్వ అసైన్డ్ భూములలో హద్దు రాళ్లు పాతుతూ మధ్యతరగతి ప్రజలను మభ్యపెడుతూ అమ్మకాలకు కొనుగోళ్లకు పాల్పడుతున్నారని ఈ క్రమంలో భూకబ్జా దారులు భూమి తమదంటే తమదంటూ గొడవలు పడుతూ లేనిపోని శాంతిభద్రతల సమస్యలను సృష్టిస్తున్నారని దీంతో చుట్టుపక్కల ప్రజానీకం భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 111, 702, 813, 204 తదితర ప్రభుత్వ అసైన్డ్ భూములు యదేచ్ఛగా క్రయవిక్రయాలకు పాల్పడుతున్న అధికార యంత్రాంగంకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అసైన్ భూముల రక్షణకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలను సమీకరించి అట్టి భూముల రక్షణకు పేదలకు నిలువ నీడ కల్పించడానికి పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ మాషూక్ స్థానిక నాయకులు గజవెల్లి జగపతి నకినబోయిన మహేష్ అశోక్ మాలమ్మ జమున కృష్ణ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ స్మార్ట్ సిటీ, తదితర అభివృద్ధి పనులపై సమీక్ష

- పాల్గొన్న ఎమ్మెల్యే, కుడా చైర్మన్, నగర మేయర్, కుడా వైస్ చైర్మన్



**హనుమకొండ, మార్చి 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** బడ్జెట్ చివరి మాసం,కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టే క్రమంలో నియోజవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంబించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కుడా కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజవర్గ సమీక్ష సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కమిషన్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి సమీక్షించారు. నగరంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని, స్మార్ట్ సిటి నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. రోడ్డు విస్తరణ, భద్రకాళి, అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి రెండు పడకల ఇళ్లు ఇచ్చేలా చూడాలని కోరారు. నిజమైన అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్ పనులు 75 శాతం జరిగిందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. **వేసవికాలం ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి...** వేసవికాలం సమీపించిన సమయంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూతబడిన బోర్లను వెంటనే మరమత్తులు చేయాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. వేసవితాపం తీర్చేందుకు మూడు నెలలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు నియోజవర్గంలో ఉన్న 24 ప్రధాన పార్కులలో మరమత్తులు చేపట్టాలని సూచించారు.కుడా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్, కుడా అధికారులు ఉద్యానవనం శాఖ అధికారులు సమిష్టిగా నగరంలో మొక్కల పెంపకం,పచ్చదనం పై నూతన ఒరవడికి నాంది పలకాలని కోరారు.చాలా చోట్ల మొక్కలు నాటాల్సిన ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయడం వల్ల మొక్కల పెరుగుదల లేదని అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రక్షాళన చేయాలని,అవినీతికి పాల్పడుతున్న అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ప్రజా ప్రతినిధులు,అధికారులు అవినీతికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.సమీక్షలో చేపట్టిన అంశాల పట్ల అధికారులు కింది స్థాయి ఉద్యోగులతో క్షేత్ర స్థాయిలో పరిశీలించండి అని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వరంగల్ నగర అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో ప్రజా పాలన సాగించాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో కుడా, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# వసంతరావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హనుమకొండ, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** పర్వతగిరి మండల పరిధిలోని కల్లేడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుగ్యాల వసంతరావు నిన్న ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందగా.., ఈ విషయం తెలుసుకొని, వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మంగళవారం వారి నివాసానికి వెళ్లి వారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి ప్రగాఢ సానుభూతి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీ-పీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జటోత్ శ్రీనివాస్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేష్ తో పాటు మండల గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.





# శ్రామిక మహిళా పోరాటాలు వర్ధిల్లాలి




**హనుమకొండ, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రామిక మహిళ పోరాటాల గుర్తుగా ప్రతి ఏటా 11-3-2025 తేదీని శ్రామిక మహిళా పోరాట దినం" గా జరుపుకోవాలని ప్రధాన వక్తలు అనిశెట్టి రజిత,బి రమాదేవి లు అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ ఫోరం , ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ లోని అసోసియేషన్ కార్యాలయంలో డి జ్యోతి రమణి అధ్యక్షతన "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వక్తలుగా అనిశెట్టి రజిత(ప్రజాస్వామిక రచయితల సంఘం), బి రమాదేవి (టి పి ఎఫ్) లు హాజరు కాగా,వేదిక పైన జిల్లా కమిటీ సభ్యులు సుమ, రాజ కొమురమ్మలు హాజరయ్యారు. ప్రధాన వక్తలు అనిశెట్టి రజిత,బి రమాదేవి లు తమ ప్రసంగంలో " 11-03-2025 తేదీని శ్రామిక మహిళా పోరాట దినం" గా వ్యవహరించాలని కోరారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి ఫూలే మహిళల విద్య కొరకు, అభివృద్ధి కొరకు కృషి చేసిన విధానాన్ని వివరించారు. ఇప్పటికీ కూడా మహిళలు పూర్తి సాధికారత సాధించలేదని , అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ, కుటుంబంలో తగిన స్వేచ్ఛ,స్వాతంత్ర్యాలు లేకుండా వుంటున్నారని , మహిళలు చైతన్యవంతులు అయితేనే ఈ దేశం ,సమాజం అభివృద్ధి దిశలో పయనిస్తుంది అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలలో విజేతలకు మెమోన్టో లు అందజేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి వీరాస్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రు సుధీర్ బాబు, యన్ సదానందం,గౌరవ అధ్యక్షులు తుమ్మ వీరయ్య, హనుమకొండ సహా అధ్యక్షులు కె సమ్మారెడ్డి , సుకుమార్ రెడ్డి, సింగారెడ్డి, సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి తదితరులతో పాటు 50 మంది మహిళా పెన్షనర్లు పాల్గొన్నారు. సమావేశంలో దిగువ తీర్మానాలను ఆమోదించడం జరిగింది. 1)శ్రామిక మహిళల పోరాటాలకు సంఘీభావం తెలపాలి,2) సమాన పనికి,సమాన వేతనం కొరకు కృషి చేయాలి,3)మహిళా పెన్షనర్లు నేటి యువతకు సరైన మార్గదర్శకం చేయాలి. 4) మహిళా సాధికారత కొరకు జరిగే ఉద్యమాలలో పాల్గొనాలి,5) లింగ వివక్షతను వ్యతిరేకిస్తూ, లింగ సమానత్వం కొరకు ఉద్యమించాలి. ఈ అంశాలపై తీర్మానం చేశారు.

# 16న సీఎం స్టేషన్ ఘనపూర్ పర్యటనను విజయవంతం చేయాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- శంకుస్థాపనలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు 14వ తేదీ సాయంత్రంలోగ పూర్తి కావాలి
- ప్రణాళికబద్ధంగా కార్యాచరణ రూపొందించుకోవాలి



**హనుమకొండ, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 16న పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ పర్యటనను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు, డీసీపీతో కలిసి జిల్లా అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు.శంకుస్థాపనలకు సంబందించిన శిలాఫలకాలు, డిజైన్ నమూనాలు ఇతరాత్ర పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14వ తేదీ సాయంత్రంలోగ శంకుస్థాపనలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, ఏవైనా లోటు పాట్లు ఉంటే సరిచేసుకోవడానికి వెసులుబాటు ఉంటుందని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి గాని, కలెక్టర్ దృష్టికి గాని తీసుకురావాలని అధికారులకు సూచించారు. 16వ తేదీ మధ్యాహ్నం 12:00 గంటలకు ముఖ్యమంత్రి ఘనపూర్ సభా స్థలికి చేరుకుంటారని 12:30 గంటల నుండి 01:00 గంటల వరకు శంకుస్థాపనలు, 01:00 గంటల నుండి 02:30గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. శంకుస్థాపనలకు సంబందించి ఆయా శాఖల అధికారులు శిలాఫలకాలు, డిజైన్ నమూనాల వంటి ఏర్పాట్లు చేసుకోవాలని, అలాగే ప్రోటోకల్ కు కలెక్టర్ గారి అనుమతి తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఇంకా కేవలం 4రోజుల సమయం మాత్రమే ఉన్నందున అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సభా ఏర్పాట్లకు సంబందించి డయాస్, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీవీఐపీ పార్కింగ్, ఆయా మండలాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్ వంటి ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది రాకుండ సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలేత్తకుండా పటిష్టమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని తెలిపారు.ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా కింది స్థాయివరకు పర్యవేక్షణతో పని చేయాలని తెలిపారు. ఇందుకు జిల్లా అధికారులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ సాగర్ ద్వారా రబీ పంటలకు నీరందించాలి: వరంగల్ కలెక్టర్ సత్య శారద



**హనుమకొండ, మార్చి 11(పి సి డబ్ల్యూ న్యూస్):** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ డిబిఎమ్ 54, 57 కాలువ ద్వారా రబి కాలానికి పంటలకు నీరు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మహబూబ్నగర్, ఉకల్, ఘటికల్, జగన్నాథపల్లి గ్రామాలలో క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి కలెక్టర్ వ్యవసాయ పంట పొలాలను సాగునీరు అందుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మైలారం బ్యాలెన్సింగ్ సందర్శించి నీటి నిలువ సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారాబంది నీటి విడుదల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ చివరి పంట వరకు రబీ కాలానికి పంట చేతికి వచ్చేవరకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా సాగునీరు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఇరిగేషన్ ఈఈ రమేష్ బాబు, డిఈ కిరణ్ కుమార్, తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# న్యాయం కోసం నా పోరాటం: తాడూరి గగన్ కుమార్

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,మార్చి 11,(పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండల పరిధిలోని సర్వేనెంబర్ 199 స్టేడియం మరియు అందులోని అంతర్భాగమైన స్మశానవాటిక స్థల విషయంలో భాగంగా ఈ రోజు (AS 45/2023) జిల్లా కోర్టులో విచారణ జరిగినది, ఇందులో భాగంగా కోర్టుకు వెళ్లిన వ్యక్తులు న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘిస్తూ స్టెటస్కో మైంటైన్ చేయకుండా నిర్మాణ పనులు జరుపుతున్నారని రెవిన్యూ జిహెచ్ఎంసి తరపు న్యాయవాదులు గౌరవ కోర్టు దృష్టికి తెలియజేయగా గౌరవ జడ్జిగారు మెమో వేయవలసిందిగా కోరారు. నిర్మాణ పనులు సంబంధించిన ఫోటోగ్రాఫ్స్...వెలసిన గుడిసెలు, కరెంట్ పోల్స్, ఇంటి నిర్మాణం కోసం నిర్మించే బేస్మెంట్ పనుల రుజువులతో కూడిన మరికొన్ని పత్రాలు మెమో రూపంలో జిల్లా కోర్టుకు అందించగా లోయర్ కోర్ట్ రికార్డును పరిశీలిస్తూ స్టేటస్కో కొనసాగిస్తూనే ఇట్టి కేసును కేవలం వారం రోజుల గడువుతో అనగా తేదీ 18-03-2025 వచ్చే మంగళ వారానికి వాయిదా వేయడం జరిగింది. న్యాయం కోసం నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది అని జమ్మిగడ్డ స్మశానవాటిక పరిరక్షణ కమిటీ, కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ అన్నారు.

# రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ కలిసిన కరీంనగర్ అధ్యక్షులు



**గంగాధర మార్చి 11 (పీసీ డబ్ల్యూ న్యూస్):** ఈరోజు హైదరాబాద్ లక్ష్మి కన్వెన్షన్ లో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ గారితో మరియు రాష్ట్ర యువజన అధ్యక్షులు రామకృష్ణ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కన్న కృష్ణ ప్రధాన కార్యదర్శి కొమురెల్లి వెంకటేశం యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయికృష్ణ కలిసినారు.

# వాహనా తనిఖిల్లో గంజాయి పట్టివేత





**బయ్యారం(క్రైమ్)మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారంలో ఇల్లందు-మహబూబాబాద్ మెయిన్ రోడ్డు వద్ద బయ్యారం ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా ఒక బ్యాగ్ ను కలిగి ఉండడంతో అనుమానం వచ్చి ఆ వ్యక్తులను ఆపి,బ్యాగులను తనిఖీ చేయగా బ్రౌన్ కలర్ బ్యాగులో గంజాయి ఉండడంతో వెంటనే వారిని పట్టుకొని పంచుల సమక్షంలో బయ్యారం మెయిన్ రోడ్డు సెంటర్ వద్ద తూకం వేయగా సుమారు 20 కిలోల ఎండు గంజాయి దొరికిందని,వీటి విలువ సుమారు పది లక్షల రూపాయల వరకు ఉంటుందని ఎస్ ఐ తెలిపారు.ఈ గంజాయి సరఫరా చేసే వ్యక్తులు సంతోష్ నాయక్, పత్రాపూర్ గ్రామం ఒడిశా రాష్ట్రం,మరొక వ్యక్తి అర్జున్ దాస్ సిరిసింగి గ్రామం ఒడిస్సా రాష్ట్రం నుండీ వచ్చినట్లు చెప్పడంతో ఎస్ఐ ఇద్దరిని పంచుల సమక్షంలో అదుపులో తీసుకొని గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాపారావు,యాకూభ్,సురేష్, పాషా తదితరులు ఉన్నారు.



## మృతుడి భార్యకు గాయత్రి బ్యాంక్ చెక్కు అందజేత

**మానకొండూర్,మార్చ్11(పీసీడబ్ల్యూ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో మరణించిన కరీంనగర్ గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడు కెన్నరసారం తిరుపతి సతీమణి వెంకటలక్ష్మికి లక్ష రూపాయల భీమా మొత్తాన్ని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. కేశవపట్నం గ్రామానికి చెందిన తిరుపతి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా, నామిని అయిన అతని భార్య వెంకటలక్ష్మికి ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్యాంక్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ గొట్టె అశోక్, సీనియర్ ఆఫీసర్ వేముల విష్ణువర్ధన్, జూనియర్ ఆఫీసర్ ఉల్లంగుల అనిల్, బ్యాంకు అడ్వకేట్ కొరిమి ప్రవీణ్ కుమార్, కేశవపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొడిసల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ







**ఖానాపూరం మర్చి 11, ( పీసీ డబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలం అశోక్ నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు కే నరసింహులు ఉపాధ్యాయులు ఎల్ బాలాజీ, ఎన్ రజిత దేవి, సాంబయ్య రాజు నాయక్ రజిత వెంకటరమణ మరియు రజిని పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్న స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులుగా మారి బోధించడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం పిల్లలకు సర్టిఫికెట్లు మరియు బహుమతి ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ అశోక్ నగర్ ఉన్నత పాఠశాల. ఇన్చార్జి హెచ్ఎం సారంగపాణి ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది అని వారు తెలిపారు.

## చేయూత అందించిన స్నేహితుడు

### - వికలాంగుడైనా స్నేహితునికి ఆర్థిక సహాయంగా బైక్ బహుమతి

**ఖానాపూరం మర్చి 11,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపూరం మండలం బుదరావుపేట గ్రామానికి చెందిన అనపర్తి లింగయ్య వృత్తి రీత్య సాఫ్ట్ వేరు ఉద్యోగి, వికలాంగుడైనా అశోక్ నగర్ గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ ఇద్దరు కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004-2007 సంవత్సరంలో కలిసి చదువుకున్నారు. తనమిత్రుడు వికలాంగుడు కావడం వలన ఎటుఅయినా వెళ్లి రావడానికి ఇబ్బంది పడటం చూసి స్నేహితుడికి 50000 రూపాయలు అందించడం జరిగింది. ఈ రూపాయలతో రమేష్ చిన్న చిన్న మార్పులతో ఒక బైక్ తీసుకోవడం జరిగింది. లింగయ్య తన మిత్రుడి బాధను గమనించి చేయూత అందించినందుకు రమేష్ తన స్నేహితుడికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది.మాములుగా అంటారుకదా ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు అని అది ఇదేనేమో.



# మానవత్వమే అభిమతంగా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ సేవలు

**● గ్రామీణ ప్రాంత మస్జిద్ ల ఇమాంలకు ఇఫ్తార్ సామాగ్రి.. ● హీర ఫౌండేషన్ ద్వారా 120 గ్రామాల మస్జిద్ ల ఇమాం లకు పండుగ బట్టలు..30 మారుమూల పల్లెల్లో ఇఫ్తార్ సామాగ్రి పంపిణీ ● ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ వెల్లడి...**



**కరీంనగర్ జిల్లా మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** మానవత్వమే అభిమతంగా మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇస్లామిక్ సాంప్రదాయ విద్యను అందించడానికి, సేవలందిస్తుందని మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్ట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం నగరంలోని రేకుర్తి శేఖాన్ నగర్ లోని మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ లో జిల్లాలోని మారుమూల 120 పల్లెల్లో, గ్రామాల్లో (పస్మాంద్ద ఇలాఖా) మస్జిద్లలో పని చేస్తున్న ఇమామ్లకు కుటుంబ సమేతంగా నూతన బట్టలు హీర ఫౌండేషన్ ద్వారా అందించమన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మస్జిద్ ఇమామ్ లకు బియ్యం, వంట సామాగ్రితో పాటు 30 గ్రామాల్లో, మారుమూల పల్లెల్లో నివసించే పేద ముస్లింలను దృష్టిలో పెట్టుకుని ఇఫ్తార్ విందు కోసం పండ్లు, ఖారా, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ మారుమూల ప్రాంతాల్లో పేదలు ఇఫ్తార్ విందులు చేసుకోవడం కష్ట తరమని భావించి ఈ బృహత్తర యజ్ఞం మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గత 25 సంవత్సరాలుగా శ్రీకారం చుట్టిందన్నారు. పవిత్ర రంజాన్ మాసం దాన, ధర్మలా మాసమని, ధనికులపై పేదలకు హక్కు కల్పించిన ధర్మం ఇస్లాం మాత్రమే నన్నారు. ఈనెలలో ఉపవాస దీక్షలు పాటించే ఏవ్యక్తి కైనా మంచి నీళ్లు మొదలు పండ్లు, డ్రైఫ్రూట్స్, వంట సామగ్రి రూపంలో సాయం అందించే వారికి సైతం ఉపవాస దీక్షలు పాటించినంత పుణ్యం లభిస్తుందని మహానియ మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సెలవిచ్చారని చెప్పారు. ఏటా రంజాన్ మాసం సందర్భంగా, గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న మస్జిద్ ఇమాంలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హీర ఫౌండేషన్ కరీంనగర్ ఈ బృహత్తర కార్యక్రమాన్ని దాతల సహకారంతో చేపట్టడం, తమకు ఈ పుణ్య కార్యంలో భాగస్వామ్యులు చేయడం సంతోషాదాయకమన్నారు. హీర ఫౌండేషన్ ద్వారా కరీంనగర్ నగర మున్సిపల్ డివిజన్లతో పాటు ఉమ్మడి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో, పల్లెల్లో సుమారు1400 కుటుంబాల్లో రంజాన్ వంట సామాగ్రి కిట్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. హీర ఫౌండేషన్ కరీంనగర్, మజ్లిస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు కరీంనగర్ శాఖలకు పెద్ద ఎత్తున జకాత్, సదా?త్, అతియా, ఫిత్రాల రూపంలో విరాళాలు అందించి మారుమూల ప్రాంతాల్లో నివసించే పేదలకు సాయం అందించే యజ్ఞం లో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9346355306ను సంప్రదించాలని కోరారు. ఈకార్యక్రమంలో హాఫిజ్ అహ్మద్ నియాజీ, హాఫిజ్ ఫరీదోద్దీన్, కలీం షరీఫ్, ముఖరం, రఫీ, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు

**● కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవం ● విశిష్ట అతిథులుగా హాజరైన మహబూబ్ నగర్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 10(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు పట్టణములో 113 డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవం వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు పెళ్ళి చెసే అప్పుడు కట్నకానుకలు విషయంలో తల్లి తండ్రులు ఇబ్బందులకు గురికావొద్దని కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పేరిట లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. అలాగే డెలివరి కోసం హాస్పటల్ కి వెళితే ఆడపిల్ల పుడితే పదమూడు వేలు, మగ పిల్లలు పుడితే పన్నెండు వేలు, కె సి ఆర్ కిట్లు పంపిణీ చేశారు అని అన్నారు. పెద్దాయను స్ఫూర్తిగా తీసుకుని పటాన్ చెరువు పట్టణములో ఉన్న మహిళలకు కుట్టుమిషన్ ట్రైనింగ్ ఇప్పించాను, రాఖీ పండగలకు మహిళలకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇచ్చాను,రాబోయే నా పుట్టిన రోజున మళ్ళీ స్కూటిలు, కుట్టు మిషన్ ట్రైనింగ్ తీసుకున్న వాళ్లకు కుట్టుమిషన్ లు బహుమతిగా ఇస్తానని ఈ సభా ముఖంగా మాట ఇస్తున్నా అని అన్నారు.

## రైతులకు త్వరత గతిన కొత్త పంట రుణాలు ఇవ్వాలి





**హనుమకొండ, మార్చి 11(పీసీడబ్ల్యూ న్యూస్):** రుణ మాఫీ 2024 కింద లబ్ధి పొందిన రైతులకు త్వరగతిన తిరిగి కొత్త పంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కో - ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట కో - ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అధ్యక్షతన డిసిసిబి బ్యాంక్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత గల రైతులకు సంబంధించిన ఇన్వాలీడ్ ఆదార్ లు గా ఉన్నటువంటి ఎర్రర్ లను ప్రభుత్వం వారి అనుమతితో సరియైన ఆధార్ కాపీలను సమర్పించి రైతులకు లబ్ధి చేకూరేలా చేయాలని సూచించారు. నిర్దేశించిన టార్గెట్స్ అన్నింటిని గడువు లోగా సాధించాలని, ప్రతి నెల వారీగా వ్యక్తిగత పెర్ఫార్మన్స్ ఇంప్రూవ్ అవ్వని యెడల తగిన చర్యలు తీసుకోవాలని సీఈఓ ని ఆదేశించారు. సంఘాల ద్వారా ఇచ్చి ఉన్న రుణాలను కూడా లీగల్ గా కవర్ చేసి రికవరీ చేసి సంఘాలను పటిష్టం చేయాలని సూచించారు.ఐ ఆర్ ఏ సి నామ్స్ కి లోబడి 31.03.2025 సంవత్సరానికి గాను నిరార్థక ఋణాలుగా వర్గీకరించబడిన మొండీ బకాయిలను 2% కి మించకుండా రికవరీ చేయాలనీ మేనేజర్లను ఆదేశించడం జరిగింది. ఎన్ పి ఏ 2% లోబడి టర్నోవర్ రూ. 2500 కోట్లకు చేరుకునేలా ప్రయత్నం చేయాలని అన్నారు.తదుపరి జరగబోయే నాబార్డ్ వారి సమీక్ష నందు కూడా మన బ్యాంక్ 'ఏ" ర్యాంకు అవార్డు గా పొందడానికి అందరూ ఆర్బీఐ, నాబార్డ్ వారి ఆదేశాలను పటిస్తూ బ్యాంక్ అబివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జి ఏం ఉషా,డీజీఎం అశోక్,ఏజిఎంలు మధు,గొట్టం స్రవంతి, బోడ రాజు,గంప శ్రవంతి,కృష్ణ మోహన్, డిఆర్ ఓఎస్డీ విజయ కుమారి,వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

## కొమురమ్మను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు



**హనుమకొండ, మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ఐనవోలు మండల పరిధిలోని పున్నెల్ గ్రామానికి చెందిన మండల మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా తల్లి కొమురమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా.., మంగళవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేసిన సుడా చైర్మన్

**● ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచడం వల్లే పౌష్టికాహారం అందించగలుగుతున్నాం**
**● ప్రిన్సిపాల్ నాణ్యత విషయంలో రాజీ పడొద్దు**
**● కాంట్రాక్టర్ అధిక లాభాపేక్ష లేకుండా నాణ్యమైన సరకులు అందించాలి.**
**● పలు సూచనలు చేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.**





**కరీంనగర్,మార్చి11పీసీడబ్ల్యూ న్యూస్):** నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే బలహీన వర్గాల సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల విద్యార్థినులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా వంటశాలలోని సరుకులను పరిశీలించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ చార్జీలు పెంచడం వల్ల పౌష్టికాహారం అందించగలుగుచున్నామని గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.భోజనం చేస్తూ విద్యార్థినులతో మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ప్రిన్సిపాల్ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని కాంట్రాక్టర్ సరఫరా చేసే సరుకులు నాణ్యతతో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని నరేందర్ రెడ్డి సూచించారు.చిన్న చిన్న లోపాలు గుర్తించామని వాటన్నిటిని సరిచేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన మెనూను నాణ్యతతో అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మెండి చంద్రశేఖర్, మొహమ్మద్ మేరాజ్, జిల్లా ఎస్సీ,ఎస్టీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్,కుర్ర పోచయ్య,పెద్దిగారి తిరుపతి,కొట్టె ప్రభాకర్,కీర్తి కుమార్,అష్రఫ్ ఖురేషి,రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## రైతు పంట పొలాలకు త్వరితగతిన సాగునీరు అందించాలి: ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు





**హనుమకొండ, మార్చి 11(పీసీడబ్ల్యూ న్యూస్):** రైతుల పంట పొలాలకు త్వరితగతిన సాగునీరు అందేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఫోన్ లో కోరారు. మంగళవారం పర్వతగిరి మండల కేంద్రంలోని 0.2 పర్వతగిరి రిజర్వాయర్ క్రింద ఉన్న ఆయకట్టు రైతులు నీళ్లు అందడం లేదని, రైతులు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకురావడంతో వారు వెంటనే స్పందించి రిజర్వాయర్ సందర్శించి ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులు వేసిన పంట పొలాలకు నీళ్ళు అందించలేక జాప్యం చేస్తున్న ఇరిగేషన్ అధికారులను మందలించి సంబంధిత ఉన్నతాధికారులతో కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి త్వరగా నీళ్లు అందించేలా కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి రైతులు ఎవరు ఆందోళన చెందువద్దు త్వరలోనే 0.2 టిఎంసిలో పర్వతగిరి రిజర్వాయర్లు ద్వారా నీళ్ళు అందించే విధంగా సంబంధిత మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎంసి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జటోత్ శ్రీనివాస్ నాయక్, మండల గ్రామ స్థాయి నాయకులు రైతులు తదితరులు ఉన్నారు.

## కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర మార్చి (11 పీసీ డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం లో జరిగిన పవిత్రోత్సవాలలో బగంగా పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన గౌరవ చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్. శ్రీ మేడిపల్లి సత్యం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 16న జరిగే బహిరంగ సభ.. ఘన్పూర్ దిశను మార్చే సభ

- నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నా..
- జఫర్ గడ్ మండలంలోని అన్ని గ్రామాలకు గోదావరి జలాలు తీసుకువస్తా..
- జఫర్ గడ్ మండలంలో 200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- ఈ నెల 16న సీఎంతో రూ. 800కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అనంతరం భారీ భాహిరంగ సభలో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త తరలిరావాలి




**హనుమకొండ, మార్చి 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఈనెల 16వ తేదీన నిర్వహించే భారీ బహిరంగ సభస్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ దిశను మార్చే సభ, అభివృద్ధికి దోహదం చేసే సభ అని కావున నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. జఫర్ గడ్ మండల కేంద్రంలో జఫర్ గడ్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చందుకు, నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు, ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు, ప్రతీ గ్రామానికి బీటిరోడ్లతో పాటు అనేక అభివృద్ధి పనులను చేయాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్క ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధికి 800కోట్లపైగా నిధులు తీసుకువచ్చానని తెలిపారు. ఈ రూ. 800కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయడానికి ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పీట వేసి అత్యధిక నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి గారికి మనందరం ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభకు భారీ జన సమీకరణ చేసి నియోజకవర్గంలో మన బలంఏంటో చూపించాలని అన్నారు. ఇంకా 4రోజుల సమయం మాత్రమే ఉందని కావున ఏ గ్రామంలోని నాయకులు ఆ గ్రామంలో మహిళలు, రైతులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సభ మన నియోజకవర్గదిశను మార్చే సభ అని కావున ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ముందు ఉండి నడవాలని, మనందరం కలిసి 16న జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఆసుపత్రుల పై కఠిన చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు



**హనుమకొండ, మార్చి 11(పి సి డబ్ల్యూ న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు వరంగల్ తన బృందం చే ఒక ప్రైవేట్ హాస్పిటల్లో సంభవించిన మాతృ మరణముల గురించి తెలుసుకొని వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి ఒక ఎక్స్పర్ట్ కమిటీని నియమిస్తున్నామని తెలిపినారు ఎక్సపర్ట్ కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపినారు అదేవిధంగా ప్రతిమ క్యాన్సర్ హాస్పిటల్ అపోలో ఎన్ఎస్ఆర్ వైస్ హాస్పిటల్ లలో ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగినది అనంతరం మాట్లాడుతూ.. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపినారు క్లినిక్కులు, పోలీక్లినిక్కులు, హాస్పిటల్స్ నడిపే వారు తప్పనిసరిగా నియమనిబంధనలు పాటించాలని కోరారు. జిల్లాలోని అన్ని క్లినిక్కులు, పోలీ క్లినిక్కులు, ల్యాబ్ లు, హాస్పిటల్స్, వెల్నెస్ సెంటర్లు, ఫీజియోథెరఫీ సెంటర్లు, నేత్ర క్లినిక్కులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి, అలాగే జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హెూమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్, క్లినిక్కులు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని, లేనిచో పెనాలిటీ, సీస్ చేయటము, అటువంటి క్లినిక్కులు, ఆసుపత్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడును అని తెలిపారు. ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకుడదని, వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలనీ ఇంజెక్షన్లు, సెలైన్ లు పెట్టరాదని అల్లోపతీ వైద్యం చేయరాదని వారి దగ్గర మందుల నిల్వ ఉంచు కోరాదని అయన తెలిపారు. ప్రతి వైద్యుడు కూడా "ప్రిస్క్రిప్షన్ క్లియర్గా" మాత్రమే వ్రయాలని కోరారు.ప్రతి క్లినిక్, పోలీక్లినిక్, నర్సింగ్ హెూమ్, హాస్పిటల్స్, ఆయుష్ క్లినికల్, పోలీ క్లినిక్ ఆసుపత్రుల వారు వారి వారి సెంటర్లలో వసూలు చేయి ఫీజుల వివరములు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషలో రిసెప్షన్ నందు బోర్డులు ఏర్పాటు చేయాలనీ, ఆ ప్రకారమే రోగుల నుండి చార్జీలు వసూలు చేయాలనీ, అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పరిశుభ్రత, సౌకర్యాలు అందించే విషయంలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వారి, వారి ఇంస్టిట్యూట్స్లో పని చేసే వైద్యులు వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, వారి వారి విద్యార్హతలు కూడా రిసెప్షన్ వద్ద ప్రదర్శించాలని కోరారు. ప్రతి హాస్పిటల్, నర్సింగ్ హెూమ్ వారు నిర్ణయించుకున్న రేట్స్ (రాక్ రేట్లను) ప్రతి సంవత్సరం జూన్ నెల మొదటివారంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని లేనిచో కఠిన చర్యలు తీసుకోనున్నట్టు అయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో సిజేరియన్ ఎక్కువగా ఉంది కాబట్టి తప్పనిసరిగా ఇండికేషన్ఉన్న కేసులకు మాత్రమే సి-సెక్షన్ కాన్పులు చేయాలి. అనవసరంగా ఇండికేషన కాకుండా సి-సెక్షన్ కాన్పులు చేస్తే వైద్య అధికారులు కేసు ఆడిట్ చేసి అనవసరంగా సి సెక్షన్ చేసిన హాస్పిటల్స్ పై చర్యలు తీసుకుంటారు మరియు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కు రాసి సదరు వైద్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే నిబండలంకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షలో అబార్షన్స్ చేయాలనీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అబార్షన్స్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెల చేసిన అబార్షన్స్ వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయంలో అందించాలని కోరారు. గైనకాలజిస్టులు ఏఆర్టి సరోగసి లెవెల్ వన్ లెవల్ టు, రిజిస్ట్రేషన్లు కలిగిఉన్న వారు మాత్రమే ఐవిఎఫ్ సెంటర్లు నడుపుకోవడానికి నడుపుకోవడానికి అర్హులని తెలిపినారు అర్హులు . మా ప్రత్యేక తనిఖీ బృందాలు లోపాలను గుర్తించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చిన జబ్బుల గురుంచి పేషెంట్లకు తప్పనిసరిగా వారికీ అర్ధమయ్యే భాషలో వివరించాలని, జబ్బుకు అయ్యే ఖర్చులని కూడా ముందుగానే వివరించాలని, రోగుల హక్కులు, బాధ్యతలు ప్రతి ఆసుపత్రలో తెలిపే విదంగా బోర్డులను ఏర్పాటు చేయాలనీ కోరారు. జిల్లాలో తనిఖీ బృందాలు నిరంతరం క్లినిక్కులు, ఆస్పత్రులు, తనిఖీ చేస్తుంటాయని, తనిఖీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబందించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరములు చూపించవలెనని కోరారు. ఎవరైనా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పి సి పి ఎన్ డి టి ఆక్ట్ లకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపినారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన డిప్యూటీ అనిల్ కుమార్, మనోజ, ఎల్ డి కంప్యూటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బడుగులకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడం హర్షణీయం

- బీసీ ఉద్యమ స్ఫూర్తితోనే ఎమ్మెల్సీ ఎంపికలో సామాజిక న్యాయం
- బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**హనుమకొండ, మార్చి 11(పి సి డబ్ల్యూ న్యూస్)**రాష్ట్రంలో రోజు రోజుకు బిసిలో వస్తున్న రాజకీయ చైతన్య స్ఫూర్తితోనే.. అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎంపికల్లో బడుగులకు సామాజిక న్యాయం పాటించారని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాల ఆదరణ, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు ఓటు బ్యాంకుతో సంఘటితం కావడం, బీసీలు నిరంతరం ఉద్యమించడన్ని గమనించిన అధికార కాంగ్రెస్ పార్టీ మూడు ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు, టిఆర్ఎస్, సిపిఐ కూడా బీసీ అభ్యర్థులను ప్రకటించడం అభినందనమని అన్నారు. తెలంగాణ చరిత్రలో మొదటిసారి అగ్రకుల అభ్యర్థులు లేకుండా అన్ని పార్టీలు పోటీపడి బడుగులకు అవకాశం కల్పించడం శుభపరిణామని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎంపికలో 100% అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గాని, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా ప్రకారం వారికి సీట్లు కేటాయిస్తేనే అన్ని పార్టీలకు రాజకీయ మనుగడ ఉంటుందని, బీసీలను విస్మరిస్తే ఫలితాలు తారుమారు కాక తప్పదని అన్నారు. అన్ని పార్టీల నుండి ఎంపికైన కొత్త ఎమ్మెల్సీ అభ్యర్థులకు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జాతీయ వీల్ చైర్ క్రికెటర్ను అభినందించిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊడుగుల వెంకన్న




**మహబూబాబాద్, మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** సీరోలు మండలం చిలుక్కోయాలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 5వ తారీఖున ఒడిస్సాలో జాతీయ వీల్ చైర్ టోర్నమెంట్లో తెలంగాణ రాష్ట్ర తరపున ఖమ్మం నుండి ఎంపికైన బండ్ల రాము గెలుపొందడం జరిగింది. మొదటిసారిగా సొంత గ్రామానికి విచ్చేసిన సందర్భంగా వారిని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊడుగుల వెంకన్న, మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి యాకూబ్ పాషా, ప్రాథమికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేరయ్య లు కలిసి వారిని శాల్వాతో సత్కరించి అభినందించడం జరిగింది. ఊడుగుల వెంకన్న మాట్లాడుతూ... మన గ్రామం నుండి ఒక జాతీయ స్థాయిలో టోర్నమెంట్లో గెలుపొందడం మన గ్రామానికి గర్వకరణం అని అన్నారు. ఈ సందర్భంగా బండ్ల రాము మాట్లాడుతూ.. నాకు మంచి అవకాశం కల్పించి నన్ను అంత దూరం పంపించిన గ్రామం నాయకులకు యువతకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. నా పట్ల శ్రద్ధ చూపి నాకు సాయం చేసిన ప్రతి ఒక్కరికి నేను రుణపడి ఉంటాను అని అన్నారు. యొక్క కార్యక్రమంలో గ్రామ యువకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## 5వ డివిజన్ హుస్సైనీపురలో మున్సిపల్ కార్మికులతో డ్రైనేజీలోని చెత్తను తొలగించి మురికి నీరు వెళ్లేలా చేపించిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షబానా మహమ్మద్...

**కరీంనగర్ టౌన్ మార్చి 11(పిసి డబ్ల్యూ న్యూస్):** ఈరోజు కరీంనగర్ నగరంలోని 5వ డివిజన్ లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షబానా మహమ్మద్ మున్సిపల్ కార్మికులతో డ్రైనేజీలోని చెత్తను తొలగించి మురికి నీరు వెళ్లేలా చేపించడం జరిగింది.. ఇండ్లలో నుండి మురుగు నీరు మోరీలలో వెళ్లకుండా రోడ్డు పైకి వస్తుండటంతో డివిజన్ ప్రజలు కాంగ్రెస్ నాయకురాలు మొహమ్మద్ షబానా చెప్పడంతో మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిశుద్ధ కార్మికులచే పనులు చేపిస్తు వారికి సూచనలు ఇస్తున్న షబానా మొహమ్మద్, కాలనీలను క్లీన్ చెపిస్తూ మొరిలలో చెత్తాచెదారం వుండకుండా పరిశుభ్రంగా వుండాలనే ఉద్దేశ్యంతో గల్లి గల్లిలలో పర్యటిస్తూ కాలనీలను శుభ్రంగా ఉండేలా చేస్తున్న షబానా మొహమ్మద్ను డివిజన్ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

## పోలీస్ కమిషనర్ను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేత సమద్ నవాబ్...



**కరీంనగర్,మార్చ్11(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా నూతన పోలీస్ కమిషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన గౌస్ ఆలం ను టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పూల బొకే అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తామని సమద్ నవాబ్ చెప్పారు. పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా పటిష్ట చర్యలు ఎస్ ఈ సాలియా నాయక్

**జగిత్యాల, మర్చి 11 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** రాబోవు వేసవి కాలానికి విద్యుత్ డిమాండ్ అనుగుణంగా అన్ని రకాల నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సాలియా నాయక్ తెలిపారు. అందులో భాగంగా జగిత్యాల డివిజన్ పరిధిలోని టౌన్ 1 సెక్షన్ లో వీక్లీ బజార్ స్కూల్ ఏరియా లోని SS-234/100 కె.వి.ఏ నియంత్రిక సామర్థ్యంని 160 కె.వి.ఏ కు పెంచి ఛార్జ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గోపీ కృష్ణ , ఏ డీ ఈ జవహర్ లాల్ నాయక్, ఏ.ఈ సతీష్, విద్యుత్ సిబ్బంది మరియు వినియోగదారులు పాల్గొన్నారు.




# కాలువలో పడి వ్యక్తి దుర్మరణం.!



**గోదావరిఖని,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** కార్పొరేషన్ 5వ డివిజన్ మల్కాపూర్ గ్రామ శివారులోని మురుగునీటి కాలువ లో మంగళవారం కూలీ పని కొరకు వెళ్తూ ప్రమాదవశాత్తు మానాల వెంకటేష్(47) మల్కాపూర్ గ్రామ నివాసి, తన మోటార్ సైకిల్ స్కూటీ తో సహా కాలవలో పడిపోయి మృత్యువాత పడ్డాడు. భార్య మానాల స్వప్న ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ కె రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఖనిలో షాపింగ్ కాంప్లెక్స్..!

## - 15కోట్లతో నిర్మాణ పనులు

## ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్







**గోదావరిఖని,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):**గోదావరిఖనిలో సింగరేణి ఆధ్వర్యంలో 15కోట్ల నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతాన్ని ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాగూర్, ఆర్జీవన్ జిఎం లలిత్ కుమార్, సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్



**కోరుట్ల,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** మహాత్మ జ్యోతిబాపూలే వెను కబడిన తరగతుల సంక్షేమ గు రుకుల బాలుర పాఠశాలలో మం గళవారం మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్బి హెచ్ కె స్క్రీనింగ్ టీం ద్వారా స్టూడెంట్ కు జగిత్యాల హాస్పిటల్ లో కంటి పరీక్షలు నిర్వహించి కమి షనర్ చేతుల మీదుగా స్టూడెంట్ కి కంటి అద్దాలు పంపిణీ చేయడం జ రిగింది ప్రిన్సిపా ల్ ఎండి జుబేర్ డాక్టర్ అంజిత్ రెడ్డి హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ జూనియర్ అసిస్టెంట్ ప్రగతి ఎన్విరాన్మెంట్ ఇం జనీర్ విష్ణు ముజీబ్ టిఎంసి సోమి డి శివ అశోక్ అనిల్ మెడికల్ ఆఫీ సర్ అప్సాన్ నిషాత్ రాధా ఫార్మ సిస్ట్ సరిత ఏఎన్ఎం అధ్యాపక బృందం పాల్గొన్నారు

# నూతన సీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిజేపి నేతలు

**గోదావరిఖని,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** రామగుండం నూతన కమిషనర్గా పదవీ బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝా ని మంగళవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి, తోట కుమారస్వామి, మండల అధ్యక్షులు, మిట్టపెల్లి సతీష్ కుమార్, గుండబోయిన భూమయ్య, కోడూరి రమేష్, సిలువేరు అంజి పాల్గొన్నారు.



# బిసి రిజర్వేషన్లలో నుండి బీసీ ముస్లింలను ఎలా మినహాయిస్తారు...?

- ముస్లిం బీసీలు హిందూ బీసీలు అంటూ మతపరంగా విభజించి కుల గణన చేస్తారా..?
- ముస్లిం మైనార్టీలకు, మరియు,బీసీలకు కలిపి 52%రిజర్వేషన్లు కల్పిస్తూ త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ఏకగ్రీవంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలి
- పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్, తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ షేక్ అబ్దుల్ రహమాన్

**సంగారెడ్డి,మార్చి 11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాహుల్ గాంధీ ఆదేశాలు ఎవరేంతో వారికి అంత అనే పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన చెయ్యడం జరిగిందికుల గణన ద్వారా బీసీల లెక్కలు తియ్యడం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనుకోవడం చారిత్రాత్మక నిర్ణయమే అయిన బీసీలను మత కోణంలో విభజించడం ద్వారా రిజర్వేషన్ల అమలు చేసే ఉద్దేశ్యం కన్నా బీసీ లలో గందరగోళం సృష్టించడం న్యాయస్థానాల అడ్డంకులు ఎదురవ్వలనే ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారుకామారెడ్డి డిక్లరేషన్ లో రేవంత్ రెడ్డి బీసీలకు 42% ఏ ప్రాతిపదికన హామీ ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు కుల గణన లో కూడా హిందూ బీసీలు 46% ముస్లిం బీసీలు 10% అని ఎలా విభజిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్ హిందూ బీసీలకు 42% రిజర్వేషన్లకు ఆమోదించడం జరిగింది సంతోషమే,బీజేపీ బీసీ రిజర్వేషన్లలో ముస్లిం బీసీ లను మినహాయించాలని కోరడం రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలను మినహాయించి 42% బీసీ రిజర్వేషన్లను ఆమోదించడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రాహుల్ గాంధీ కంటే వీరి సలహాలు సూచనలు అమలుచేస్తున్నట్లు అనిపిస్తుందని అన్నారు10% ఉన్న బీసీ ముస్లిం లను మినహాయించి 42% రిజర్వేషన్లు కల్పించడం మత పరమైన కోణంలో ఇవ్వడం అవుతుంది అలాంటి మత కోణంలో తీసుకునే నిర్ణయాలు న్యాయస్థానాలలో నిలవవు అని అన్నారు.మత పరమైన రిజర్వేషన్లు కల్పించినట్లయితే కోర్టులలో తేల్చుకుంటం అని



హెచ్చరించారు,అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు తీరా చూస్తే బీసీ ముస్లింలకు ఒక్క కార్పోరేషన్ ఏర్పాటు చేయలేదు, పైగా గతంలో బీసీ బి లకు ఇచ్చిన జీవో నేటికీ అమలు చేయలేదు, తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరములు కావస్తుంది నేటి వరకు ముస్లిం మైనార్టీ పక్షాన తెలంగాణ క్యాబినెట్లో ముస్లిం వ్యక్తి మంత్రిగా లేరు చాలా బాధాకరం,16 కార్పోరేషన్ లు ప్రకటించిన అందులో ముస్లింలను మినహాయించడం విస్మయం కలిగించింది, ముస్లిం సమాజం కు నాయకత్వం వహిస్తున్న మైనారిటీ నాయకులు పార్టీల జెండాలు పక్కన బెట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ముస్లింల ఐక్య కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఉద్యమించడం జరుగుతుందని తెలిపారు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ ముస్లిం మైనార్టీ నాయకులు ఇలాంటి విభజన రాజకీయాలను తీవ్రంగా ఖండించాలని షేక్ అబ్దుల్ రహిమాన్ పిలుపునిచ్చారు.

# ధరూర్ గ్రామంలో ఘనంగా శ్రీ పాటి మీది శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం లో విగ్రహ ప్రాణ ప్రతిష్ట, కళాన్యాస హెూమం, మహా పూర్ణాహుతి



**జగిత్యాల, మర్చి 11 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** రూరల్ మం ధరూర్ గ్రామంలో శ్రీ పాటి మీది శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శివ పంచాయతన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజులపాటు జరిగినాయి. ఈ సందర్భంగా సోమవారం ఏకకుండాత్మక హవనము, కళాన్యాస హెూమము, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్టాపన, నేత్రోన్మీలనము, దృష్టి కుంభం, దర్పన దర్శనము, బలి ప్రధానం, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సంప్రోక్షణ, బ్రాహ్మణ మహదాశిర్వచనము, రుత్విక్ సన్మానము, వివిధ పూజా కార్యక్రమాలను వేద పండితులు రావులపల్లి శేషు శర్మ, సిరిసిల్ల రాధాకృష్ణ శర్మ, కొంటికర్ల శ్రీనివాస్ శర్మ, గొల్లపల్లి కృష్ణ శర్మ , కేదార్ శర్మ, నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు దామోదర్ రావు దంపతులు పాల్గొన్నారు. మంగళ హారతి మంత్రపుష్పము నిర్వహించి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదము తో పాటు ఆశీర్వచనం చేశారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ, ప్రతిష్టాపన దాత గంగా శివ- సౌమ్య కుమారులు చి నీరవ్ దేవాంశు వ్యవహరించారు.

# జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు



**జగిత్యాల, మర్చి 11 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** జగిత్యాలలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి. రైతులకు అండగా నిలిచేందుకు పసుపు, మొక్క జొన్న, కందులకు మద్దతు ధర కల్పించాలి. మొక్క జొక్క, కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇసుకను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ధర్మ శాల స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, ఇసుక దంపులను అరికట్టడంలో జిల్లా కలెక్టర్ చొరవ అభినందనీయం. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా సాగు చేసిన మొక్కజొన్న కు గతేడాది క్వింటాల్ కురు 2500 లకు పైగా ఉన్న ధర, మొక్కజొన్న మార్కెట్ కు చేరుకొనే సమయానికి ధర రూ.2000 లకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు బోర్డు ఏర్పాటు తో పసుపు గిట్టుబాటు ధర లభిస్తుంది అని ఆశిస్తే పసుపు ధర మరింత తగ్గడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని మద్దతు ధర కల్పించాల్సిన అవసరం ఉంది. పసుపు రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. పసుపు బోర్డు ఏర్పాటు పసుపు నాణ్యత పెంచడంతో పాటు, మద్దతు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత గా భావించాలి. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించకపోవడం పై విలేకరులు అడిగిన ప్రశ్నకు. స్పందిస్తూఎమ్మెల్సీ అభ్యర్థులను పార్టీ సామాజిక కోణంలో ఎంపిక చేసినట్టు భావిస్తున్నాను అని అన్నారు. పదవితో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల్లో ఒకడిగా సేవలు అందిస్తాను అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడమే నా ధ్యేయం..

# ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలి



**హనుమకొండ, మార్చి 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఏకశిలా పార్కు సమీపంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నేతలు మాట్లాడుతూ.. ఎస్సీల వర్గీకరణకు నేడు జరగబోయే అసెంబ్లీ సాక్షిగా చట్టబద్ధత కల్పించి ఇదివరకు ఇచ్చిన నోటిఫికేషన్లలో కూడా వర్గీకరణ అమలు చేసి మాదిగలకు సంపూర్ణమైన న్యాయం చేయాలని కోరారు. నేతలు సూరన్న, దినేష్, సుకుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో పోలీస్ బ్యాండ్ ఒక ప్రత్యేక విభాగం: జిల్లా ఎస్పి అశోక్ కుమార్



**జగిత్యాల, మర్చి 11 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** భావోద్వేగాలకు తగ్గట్టుగా సంగీత బాణిలను వినిపించే పోలీస్ బ్యాండ్ పోలీసు శాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన భాగంగా నిలుస్తుందని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అన్నారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయం లో ఎస్పి చేతులమీదుగా పోలీస్ బ్యాండ్ సిబ్బంది కి స్పోర్ట్ డ్రెస్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ. పోలీస్ కవాతు ఉత్సాహంగా నిర్వహించడంలో బ్యాండ్ ప్రాముఖ్యత చాలా అవసరం అని పోలీస్ బ్యాండ్ పోలీసు శాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన భాగంగా నిలుస్తుందని ఇది కేవలం సంగీత బృందంగా కాకుండా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో జరిగే అధికారిక వేడుకలు అయన స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, అమరవీరుల దినోత్సవం, పోలీసు పరేడ్లు, గౌరవ వందన కార్యక్రమాల్లో పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని అన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బందితో పోలీస్ బ్యాండ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ బ్యాండ్ పనితీరు ప్రశంసనీయంగా ఉందని ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమం అదనపు ఎస్పి బీమ్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు మరియు బ్యాండ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో 5వ రోజు ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ఫస్టియర్ గణితము వృక్షశాస్త్రము, పౌరనీతి శాస్త్రం, ఒకేషనల్ పరీక్ష



**జగిత్యాల, మర్చి 11 ( పిసిడబ్ల్యూ న్యూస్ ):** జిల్లాలో మంగళవారం జరిగిన ప్రథమ సంవత్సర గణిత శాస్త్రము, వృక్షశాస్త్రము, పౌరనీతి శాస్త్రము మరియు ఒకేషనల్ పరీక్షలలో 8021 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 7771 మంది విద్యార్థులు హాజరైనారు 250 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు. మొత్తం 96.9 శాతం హాజరైనారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఉదయం 8:45 నిమిషములకు సెంటర్లో వాటికి కేటాయించిన సీట్ లో కూర్చోవాలని తెలిపారు పరీక్షా కేంద్రంలో ఇంటర్ బోర్డు సెక్రటరీ ఆదేశాల ప్రకారము అన్ని పరీక్ష గదులలో గోడ గడియారం ఏర్పాటు చేసినట్లు దీని ద్వారా విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఏ విధమైన ఒత్తిడికి లోను కావద్దని ఏదైనా ఒత్తిడి సమస్య ఉంటే రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలి మానస్ 14416 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి మానసిక వైద్యుల సలహాలు పొందాలని ఇది 24 గంటల ఫ్రీ సర్వీస్ అని తెలియజేశారు.

# షీ టీమ్స్ సిబ్బందితో ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రం వద్ద డేకాయ్ ఆపరేషన్...

**మహబూబాబాద్ జిల్లా మార్చి 11 (పి సి డబ్ల్యూ న్యూస్):** ఎస్పీ సుదీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలతో షీటీమ్స్ ఎస్ఐ సునంద, వారి సిబ్బంది పార్వతి, సౌభాగ్య, రమేష్ తో కలిసి పరీక్ష కేంద్రం వద్ద ఆకతాయిలను మంగళవారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం టిఎస్ మోడల్ స్కూల్ వద్ద విద్యార్థినుల పట్ల వెకిలచేష్టాలు చేస్తున్న ఆకతాయిలను షి టీమ్స్ సిబ్బంది డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని షీటీమ్స్ ఆఫీస్ కు తీసుకవచ్చారు. వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి తీవ్రంగా హెచ్చరించారు. ఎవరైనా విద్యార్థినులను ఆకతాయిలు వేధింపులకు గురిచేసినట్లయితే వెంటనే డయల్100, లేదా షీటీమ్స్ నెంబర్ 8712656935, ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సునంద తెలిపారు.



PCW తెలుగు దినపత్రిక



# 50వేలకు తగ్గకుండా ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి

**● స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం ఏంటో చూపించాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**హనుమకొండ, మార్చి 11(పిసి డబ్ల్యూ న్యూస్):** ఈనెల 16వ తేదీన ముఖ్యమంత్రి రెడ్డి రాక సందర్భంగా నిర్వహించనున్న భారీ భాహిరంగ సభ ద్వారా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం ఏంటో చూపించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి విస్తృత స్థాయి సమావేశాన్ని నిత్వహించారు.ఈ సందర్భంగా మండలంలో ఆయా గ్రామాల నుండి ఎంత మంది వస్తారు... వారికి ఏర్పాటు చేయాల్సిన వాహనాల ఏర్పాటు పై నాయకులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి చేయని విధంగా రూ. 800కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంజూరు ఇచ్చారని తెలిపారు. మన నియోజకవర్గంపై ప్రేమతో నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా 50వేల మందికి తగ్గకుండా సభ నిర్వహించాలని ఇందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత తీసుకోవాలని వెల్లడించారు. గ్రామాల నుండి మహిళలను ఎక్కువగా తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతీ ఒక్కరూ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని కోరారు. కొంత మంది సభలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తారని అలాంటి వారిని గుర్తించి సభకు తీసుకురాకుండా గ్రామ నాయకులు చూసుకోవాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే ప్రతీ ఒక్కరూ సభను జయప్రదం చేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటుంది

**● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**





**చిట్యాల మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు . గ్రామాలల్లో రూ.9.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారుమండలంలోని గ్రామంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ, బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 48 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.48,05,568/- విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మారుమూల గ్రామాలు, పంచాయితీలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ప్రజల ప్రతీ అవసరాన్ని తీర్చడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క పేద ప్రజలకు అందించేలా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దారి హేమ ఎంపీడీవో జయశ్రీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి కృష్ణయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ మాజీ కోఆప్షన్ సభ్యులు రాజ్ మహమ్మద్ మాజీ ఎంపిటిసి దెబ్బట అనిల్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ బుర్ర లక్ష్మణ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు.మండల నాయకులు. ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి....

**● బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి**




**కరీంనగర్ జిల్లా ప్రతినిధి మార్చి11(పీ సీ డబ్ల్యు న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రం లో గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహ లకున్నటువంటి ముసు గులను తొలగించి, ఆవిష్కరణ చేసేలా ప్రభుత్వం భాద్యత తీసుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి డిమాండ్ చేసారు.అంబేద్కర్, జగ్జీవన్ రాం విగ్రహల ముసుగులను తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అన్నీ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలతో ఏర్పడిన జేఏసి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండవ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని దేవేందర్ రెడ్డి సందర్శించి సంఘీభావాన్ని వ్యక్తం చేసారు. గత ప్రభుత్వం లో నాటి ఎమ్మెల్యే రసమయి ఒక సంకల్పం తో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహలను ఆవిష్కరణ చేయకుండా ఒక ఉన్నతాధికారి అడ్డుకోవడం వల్లే ఈ సమస్యకు పరిష్కారం దొరకడం లేదని అన్నారు.నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు బోయిని కొమురయ్య, మాతంగి లక్ష్మణ్, కనకం రాములు, పొన్నం అనిల్,పాశం అశోక్ రెడ్డి,గుజ్జుల ప్రణీత్ రెడ్డి,చింతం శ్రీనివాస్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,బూట్ల శ్రీనివాస్ దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.జేఏసి కన్వీనర్ లు దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి,వంతడుపుల సంపత్,అంబాల సతీష్ లతో పాటుగా వివిధ పార్టీ లకు చెందిన సీనియర్ నాయకులు ఎల్కపల్లి సంపత్,సముద్రాల లక్ష్మణ్, పార్నంది జలపతి, ఉప్పులేటి రాజు,తాటిపెల్లి సంపత్,కొయ్యడ మురళి,గాజ సాగర్,అలువాల కూమార్,కామెర వెంకటేష్,చెన్నబోయిన రవి, మాతంగి రాజమల్లు,జేజేల సంపత్,కొమ్ము సంపత్,గొల్లపెల్లి మల్లేశం గౌడ్, తుర్పాటి అజయ్,ఇనుకొండ నరేష్,అలువాల రాజశేఖర్,మేకల మహేష్,పబ్బ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేని వ్యక్తి హరీష్ రావు!



**హనుమకొండ, మార్చి 11(పిసి డబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, ఓర్వలేని వ్యక్తి ఎమ్మెల్యే హరీష్ రావు అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమాల జిల్లా, సమైక్య జిల్లాను మీ రాజకీయ ఉనికి కోసం ఆరు జిల్లాలుగా విభజించారని, సభపేరుతో అలీబాబా దోర్ ముఠా వస్తుందని విమర్శించారు. కొమ్ముకాసే మీరు ఆత్మగౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. పోరాటాలు, ఉద్యమాల పేరుతో పబ్బం గడపడం మీకు వెన్నతో పెట్టిన విద్య అని, అబద్ధాన్ని నిజం చేయటంలో కేటీఆర్, హరీష్ దిట్ట అని విమర్శించారు. మీరు కోవర్ట్ రాజకీయాలు చేసి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని మండిపడ్డాడు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉంటారని, డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని మీ రాజకీయ సభ వల్ల మాకు సంబంధం లేదన్నారు. పదేళ్లలో కాంగ్రెస్ నాయకులపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. మీ భాగోతాల్ని తప్పకుండా ప్రజల్లో ఉండేలా చూస్తామని, రాష్ట్ర స్థాయి నాయకత్వం లేకపోయినా వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారన్నారు. పదేళ్లలో మీరు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ప్రజలను మోసం చేయడానికి సభ పేరుతో దొంగల బ్యాచ్ వస్తుందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ వచ్చిన ప్రతిసారి మమ్మల్ని మాటలతో మోసం చేశారని, ఇచ్చిన మాటలకు కట్టుబడి ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం మాది అని అన్నారు. దళిత బంధు పేరుతో ట్రాక్టర్ల పేరుతో, ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసింది. మీరు కాదా అని ప్రశ్నించారు. జీతం తీసుకుని ఫార్మ్ హౌజ్ లో ఉంటే ఎలా ముఖ్యమంత్రి అని విమర్శించారు. దీన్ దయాళ్ నగర్, పెద్దమ్మగడ్డ, సమ్మయ్య నగర్ లో అభివృద్ధి చూడండని, రాజకీయం మీకు వ్యాపారం లాంటిదని మండిపడ్డారు. రాజకీయం మాకు ప్రజా సేవలాంటిదని తెలిపారు. ప్రమాదకరమైన పార్టీ బీఆర్ఎస్ అని, అధికారంకోసం ఎంతమందినైనా మోసం చేస్తారని దుయ్యబట్టారు. చేసేది తప్పులు-చెప్పేది గొప్పలు అని ఎద్దేవా చేశారు.ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుస్తారని అనడం మానేసి ఎంపీ ఎన్నికల రిజల్ట్ పై సమీక్ష చేసుకోండని చురకలంటించారు. పదేళ్ల మీ పాలన అభివృద్ధి, 15 నెలల మా పాలనపై బహిరంగ చర్చకు హరీష్ రావు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, జిల్లా మండల, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా బాగుండాలి

**● తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి**



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** మన్నెంపల్లి గ్రామం లోని ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీజేపీ నాయకులతో పాటుగా స్థానికులు పెద్దమ్మ తల్లిని సందర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మ తల్లి కి వస్త్రాలు సమర్పించి గ్రామంలో పాడి పంటలు, పశు సంపద తో పాటుగా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పెద్దమ్మ తల్లిని కోరుకున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు.ముదిరాజ్ అధ్యక్షులు గీకురు మల్లయ్య, గోదనం సాయిలు,స్థానిక బీజేపీ నాయకులు గొల్ల గణేష్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్,గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కామెర రవి,వెంకటేష్, కందుకూరి వెంకటేష్, అరుకాల సత్తయ్య, పాములగారి రాజ్ కుమార్, గొల్ల శ్రీనివాస్, బీనపల్లి రాజయ్య, కందుకూరి నరేందర్, దేవరాజ్, కొలిపాక మల్లేశం,స్వామి, కొలకాని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళను వేధించిన కేసులో మానేరు బ్రిడ్జి జేఏసీ అధ్యక్షుడితో పాటు మరో ఆరుగురు విలేకరులపై కేసు నమోదు: ఎస్ఐ

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి మార్చి11(పీసీడబ్లూ న్యూస్):** కరీంనగర్ జిల్లా: గన్నేరువరంలో మహిళను వేధించిన కేసులో మండలం లోని మాదాపూర్ గ్రామానికి చెందిన మానేరు బ్రిడ్జి జేఏసీ అధ్యక్షుడు సంపత్ ఉదయ్ కుమార్ తో పాటు తన వెనుకాల ఉండి నిరాధారణ, అసత్య వార్తలు రాసే ఆరుగురు పత్రికా విలేకరులపై కేసు నమోదు చేశారు. మహిళపై వేధింపుల కేసులో వెలుగు దినపత్రిక రిపోర్టర్ పాశం ఎల్లయ్య, ఆంధ్రజ్యోతి విలేఖరి బూర తిరుపతి, పులి సంతోష్ గౌడ్ ఆంధ్రప్రభ రిపోర్టర్, మూడికే రమేష్ రణం రిపోర్టర్, ఓరుగంటి సంపత్ నవతెలంగాణ రిపోర్టర్, గుడాల శ్రీనివాస్ దిశా రిపోర్టర్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.






# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్

**కోరుట్ల,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో మం గళవారం మున్సిపల్ కమిషనర్ టి మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్బి హెచ్ కె స్క్రీనింగ్ టీం ద్వారా స్టూడెంట్ కు జగిత్యాల హాస్పిటల్ లో కంటి పరీక్షలు నిర్వహించి కమిషనర్ చేతుల మీదుగా స్టూడెంట్ కి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగింది. ప్రిన్సిపా ల్ ఎండి జుబేర్, డాక్టర్ అంజిత్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ ప్రగతి,ఎన్విరాన్మెంట్ ఇం జనీర్ విష్ణు, ముజీబ్ టిఎంసి సోమిడి శివ, అశోక్,అనిల్ మెడికల్ ఆఫీసర్ అఫ్సాన్,నిషాత్ రాధా, ఫార్మసిస్ట్ సరిత, ఏఎన్ఎం అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కరాటేలో బంగారు మెడల్స్ సాధించిన విద్యార్థులు




**ఎన్టిపిసి,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఎంబి గార్డెన్లో ఈనెల 9న జరిగిన కరాటే హెడ్ కుంగ్ ఫు టోర్నమెంట్లో గోదావరిఖని స్టార్ టైగర్ కు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరిలో నాలుగు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్ ఒక బ్రాంచ్ మెడల్స్ సాధించారు. మంగళవారం విద్యార్థులను, తల్లిదండ్రులను, మాస్టర్లను మహాత్మా గాంధీ పూలే అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు యాదగిరి, సదానందం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను ఛీటింగ్ చేసిన వీణావాణిపైన క్రిమినల్ కేసు నమోదు చేయాలి

**- డీఇవోకు ఫిర్యాదు చేసిన సాయికృష్ణ**

**పెద్దపల్లి,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** తప్పుడు సమాచారంతో, నకిలీ సాక్ష్యాలతో, అబద్ధపు రికార్డులతో అధికారులను తప్పుదోవ పట్టించి మోసం చేసిన జూలపల్లి మండలం వడకపూర్ ప్రభుత్వ హైస్కూల్ లోని ఉపాధ్యాయురాలు ఊకంటి వీణావాణిపై ఛీటింగ్ కేసు నమోదు చేసి,చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పెద్దపల్లి పట్టణానికి చెందిన పౌరుడు జి. సాయిక్రిష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి కి ఫిర్యాదు చేశారు. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాల్సిన ఉపాధ్యాయురాలు సొంత శాఖ ఉన్నతాధికారులకే తప్పుడు స్టేట్మెంట్ లు ఇచ్చి చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నకిలీ రికార్డులను సృష్టించడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత సమాచారాన్ని ఇచ్చి ఉద్దేశ్యపూర్వకంగా తప్పుదోవ పట్టించిన వీణావాణి పై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.



శ్రీయుత గౌరవనీయులైన జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి గారికి

అర్యా!



## తాడిచర్ల ఫారెస్ట్ నుండి డబుల్ రోడ్డుకు అనుమతి సుగుమం చేసిన మంత్రి

**మంథని,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** ఖమ్మంపల్లి నుండి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వరకు వయా తాడిచెర్ల మీదుగా డబుల్ రోడ్డు కు 33 కోట్ల 70 లక్షల రూపాయల నిధులు ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం నిధులు కలుపుకొని మంజూరు చేసినతెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు.ఖమ్మం పల్లి నుండి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వరకు గతంలో రోడ్డుకు నిధులు మంజూరు కాగా ఫారెస్ట్ క్లియరెన్స్ కు డబ్బులు లేక ఆగిపోవడం వల్ల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ చూపి భూపాల్ పల్లి వరకు రోడ్డు కోసం ఫారెస్ట్ క్లియరెన్స్ నిధుల కోసం ప్రత్యేకంగా మంగళవారం రోజు జీవో నెంబర్ 113 ద్వారా 33 కోట్ల 70 లక్షలు నిధులను ప్రభుత్వం నుండి మంజూరు చేయించారు .ఖమ్మంపల్లి నుండి భూపాల్ పల్లి వయా తాడిచర్ల మీదుగా రోడ్డు భూపాల్ పల్లి జిల్లాకు తాడిచెర్ల నుండి 42 కిలోమీటర్లు దూరాన్ని ఈ రోడ్డు ద్వారా దాదాపు 18 కిలోమీటర్లు లేదా 20 కిలోమీటర్ల లోపే చేరుకోవచ్చని మంజూరు చేసిన దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కు మలహర్ రావు మండలంలోని తాడిచెర్ల తో పాటు అన్ని గ్రామాల ప్రజలు, నాయకులు అభినందనలు తెలియజేశారు.

## నేడు ఇంటర్ పరీక్షలకు 96.45 శాతం విద్యార్థులు హాజరు....

**- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన**



**పెద్దపల్లి:మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):**నేడు జిల్లాలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం సంవత్సరం పరీక్షకు 96.45 శాతం విద్యార్థులు హాజరు కావడం జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1/ బాటనీ/ పొలిటికల్ సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, (5845) మంది హాజరు కావాల్సి ఉండగా,(5638)మంది హాజరు కాగా,(207) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, 96.45 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని,పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

## దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

**తూ గో జిల్లా ,మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** జిల్లాలోని అనేక పట్టణాలు, గ్రామాల్లో దోమల విజృంభణ విపరీతంగా పెరిగిపోయింది. పగలు, రాత్రి అని తేడా లేకుండా దోమల స్వైర విహారం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న దోమకాటు నుంచి తప్పించుకోలేక పోతున్నామని అధికారులు నిర్లక్ష్య ధోరణి వదిలి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దోమల బెడదతో నానా అవస్థలు పడుతున్నామని గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛభారత్,స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత కలిపిస్తున్న మండలం స్థాయి అధికారులు మాత్రం అటువైపు దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.చీకటి పడితే చాలు ఎక్కడికి వెళ్ళినా దోమలు స్వైర విహారం చేస్తున్నాయని జిల్లా ఉన్నతాధికారుల స్పందించి ప్రతి ఇంటిలో కాయిల్స్, లిక్విడ్ సీసాల వినియోగానికి వేలాది రూపాయలు ఖర్చు చేయవలసి వస్తుందని ప్రజలు విస్తుపోతున్నారు. ఆ కాలం, ఈ కాలం అని లేకుండా నిత్యం దోమ కాటుకు గురి కావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ పై దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫాగింగ్, పిచికారి చేసి దోమలను అరికట్టాలని పలువురు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వెంటనే స్పందించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



# ఆలస్యం అయినా అమృతంలా సాగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం









- చూపుకు అందని మహిళా జనం
- అదిరిపోయింది ఈ కార్యక్రమం
- లక్కీ డ్రా ద్వారా బహుమతుల ప్రధానం
- ఎమ్మెల్యేకు వెలకట్టలేని బహుమతిని అందించిన అభిమాని

**తొర్రూరు ప్రతినిధి, మార్చి 11(పీసీడబ్ల్యు న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన నే వస్తుంది కొన్ని ముఖ్య కార్యక్రమాల వలన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపలేకపోయారని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. కొన్ని సందర్భాలు ఆలస్యం అమృతంలా మారుతాయి అని అంటారు. అదే ఇక్కడ జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎటు చూసినా మహిళా జనం, కనుచూపుమేరలో కనిపించలేదు ఎక్కడా ఖాళీ స్థలం. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్య అతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరు కాగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అమెరికాలో స్థాపించిన వేట కార్యక్రమాన్ని వెల్లడించారు. ఉన్నత పదవుల్లో ఉన్న ఎందరో మహిళలు డాక్టరు, లాయరు, ఎస్సై, చైర్మన్ ఎందరో మహిళలు ఉన్నత పదవుల్లో కొనసాగుతూ వారు సాధించుకున్న ఘనతను స్టేజి పై నుండి కార్యక్రమానికి వచ్చిన మహిళలందరికీ వివరించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు అలనాడు చదువుకోలేక మోసపోయారు, నేడు చదువుకొని కూడా మోసపోతున్నారు. యువత చెడు దారిలో ఎలా నడుస్తున్నారు,యువకులు, మత్తు పదార్థాలు ఎలా బానిసలు అవుతున్నారు దానికి కారకులు ఎవరు అనే విషయంపై ప్రతి ఒక్క అధికారిని క్లుప్తంగా వివరించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ప్రసంగిస్తూ మహిళ అంటే ఒక శక్తి అని, తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని ప్రతి ఒక్క మహిళకు అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సాధించుకుంటున్న కార్యక్రమాలను చూసి కొందరు ఓర్వలేక చెడు ప్రచారం చేస్తున్నారని ఇది వారికి తగదు అని హెచ్చరించారు. నియోజకవర్గంలోని మహిళలందరికీ చేతినిండా పని కల్పించే విధంగా లేదా వారు చేస్తున్న కొన్ని వృత్తుల ను ప్రోత్సహించటం జరుగుతుందని అన్నారు. రాయపర్తి మండలంలో ఒక కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఒక మహిళ గానుగ నూనెను నాకు బహుమతిగా అందించారని ఆ సమయంలో ఎవరు అనేది పేరు చెప్పలేకపోయారు ఇప్పటికైనా ఆ మహిళ ఎవరో నా దగ్గరికి వచ్చి కలవాలని కోరారు. ప్రతి మహిళ ఖాళీగా ఉండకుండా ఏదో ఒక వృత్తిలో కొనసాగుతూ మగవారికి దీటుగా కాకపోయినా వారి కాళ్లపై వారు నిలబడేలా చూసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రసంగిస్తూ 2018లో వేట కార్యక్రమాన్ని అమెరికాలో స్థాపించడం జరిగిందని అదే తరహాలో ఇక్కడ కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి వచ్చిన మహిళలందరికీ టికెట్లను పంపిణీ చేశారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో విలువైన బహుమతులను లక్కీ డ్రా ద్వారా 8 మంది మహిళలకు బహుమతులను అందజేశారు. ఉన్నత స్థానంలో కొనసాగుతున్న స్టేజి పైన ఉన్న ఉన్నతాధికారుని లకు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం తో పాటు జబర్దస్త్ కళాకారుడు అందరికీ ఆకర్షణగా నిలిచాడు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కి వెలకట్టలేని బహుమతిని ఒక అభిమాని అందజేశారు. కార్యక్రమం పురసఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని సన్మానించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులు ఎంతో ఓర్పుగా మహిళలకు సహకరించారు. కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి విందు భోజనాలు అందజేశారు.

# గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో సొమ్ము కేంద్రానిదైతే... రాష్ట్ర ప్రభుత్వం సోకులు పడుతుంది...

- అభివృద్ధి పనుల పేరిట, ఆరు గ్యారెంటీలు, . 420 హామీలు, బూటకపు మాటలతో కాంగ్రెస్ నేటికీ ప్రజలను మోసం చేస్తుంది..
- గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తుంది కేంద్ర ప్రభుత్వ ఈజీఎస్ పనులే నేడు గ్రామాల అభివృద్ధికి పెద్ద దిక్కుగా మారాయి..
- గ్రామ అంతర్గత రహదారులు ఈజీఎస్ నిధులతో జరుగుతుంటే, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా గ్రామాల లింకు రోడ్ల అభివృద్ధి జరుగుతుంది.
- జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఈజీఎస్ పనులపై కాంగ్రెస్ హడావిడి చేస్తూ , రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి గా ప్రచారం చేసుకుంటూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తుంది..
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు..

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి మార్చి11(పీసీడబ్ల్యు న్యూస్):** కేంద్ర ప్రభుత్వ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా నేడు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గ్రామాలకు ఈజీఎస్ నిధులే నేడు పెద్దదిక్కుగా మారాయని , గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి నిర్మాణం కోసం కేంద్రం సొమ్ము కేటాయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ పనులు తమ ఘనత అన్నట్టు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ కాంగ్రెస్ సోకులు పడుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. మంగళవారం రోజున వీణవంక మండలంలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు పనులను గంగా డి కృష్ణారెడ్డి స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను మభ్య పెట్టడానికి కాంగ్రెస్ అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థలను , ముఖ్యంగా గ్రామపంచాయతీలను ఉత్సవ విగ్రహంల కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందని ఆయన దుయ్యబట్టారు. భారతదేశంలో స్థానిక సంస్థలకు, గ్రామపంచాయతీలకు ప్రజా ప్రతినిధులు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా తీరుతో నేడు అనేక గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని , గ్రామ పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రామీణ ఉపాధి హామీ పనులే నేడు గ్రామాలకు శరణ్యంగా మారాయన్నారు. ఉపాధి హామీ పనులతోనే గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు , వీధి దీపాలు , మరుగుదొడ్లు , డంపు యార్డ్ , పల్లె ప్రకృతి వనాలు , స్మశాన వాటికలు లాంటివి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనేజరుగుతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అడ్డగోలుగా హామీలిచ్చి, ఆరుగ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ నేడు మళ్లీ గ్రామ ప్రజలను మోసం



చేయడానికి అనేక రాజకీయ డ్రామాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రస్తుతం ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అంతర్గత రహదారులు , ఇతర పనులను కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిగా చిత్రీకరించుకుంటూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడానికి సిగ్గుండాలన్నారు. గ్రామాల్లో మండలాల్లో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పిదాలను , మోసాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతినిత్యం అనేక రాజకీయ డ్రామాలు చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వీణవంక భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహ రాజు ఆదిరెడ్డి పెద్ది మల్లారెడ్డి గొడుగు వినోద్ శ్రీనివాస్ యాదవ్ దాసరి భాస్కర్ శ్రీనివాస్ రెడ్డి సిహెచ్ కొండల్ రెడ్డి ముత్యాల రవీందర్ తిరుమల్ మారం తిరుపతిరెడ్డి హరీష్ ఉట్ల కుమార్ మహంకాళి శ్రీనివాస్ పోలువదలు భూతు అధ్యక్షులు కర్రె నాని మోటం శ్రీనివాస్ పూదరి అనిల్ కర్ర రమణారెడ్డి కొలి పాక శ్రీనివాస్ గూడపు శివ ప్రశాంత్ రాజు పాల్గొన్నారు